ఆలయాల పునరుద్ధరణకు సహకరించాలి



కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి వినతి పత్రం ఇస్తున్న రిదీశ్ జాగీర్దార్, జస్మత్ పటేల్

కాచిగూడ: దేశంతో పాటు, పొరుగు దేశమైన శ్రీలంకలోని చాలా పురాతనమైన ఆలయాలు శిథిలావస్థలో ఉన్నాయని పునరుద్ధరణకు సహకారం అందించాలని అఖిల భారత పాత ఆలయాల పునరుద్ధరణ ట్రస్ట్ ప్రతినిధులు కోరారు. ఈమేరకు కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషిని కాచిగూడలోని ఉత్తరాధి మఠంలో శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వైస్ చైర్మన్ జస్మత్ పటేల్, రిదిశ్ జాగీర్దార్, డాక్టర్ సమత, దినేశ్ గోసర్ ట్రస్ట్ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను కేంద్రమంత్రికి వివరించారు. అలాగే హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి కచ్‌కు ప్రత్యేక రైలు నడపాలని కేంద్రమంత్రిని కోరారు.

న్యాయ వ్యవస్థపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ పద్మజ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రజలు న్యాయ వ్యవస్థపై అవగాహన పెంచుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లా కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ పద్మజ అన్నారు. కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు, ప్రజా ఆరోగ్య కేంద్రాల్లో శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం బాగ్‌లింగంపల్లిలోని కళాశాలలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. నిరుపేదలకు చట్టాలపై అవగాహన లేకపోవడం వల్ల వారికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఎలాంటి న్యాయ సమస్యలున్నా తమను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీదేవి, సంతోష్‌కుమార్, అంజన, సుగందిత తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'యూత్ పార్లమెంట్ డే'



కార్యక్రమంలో విద్యార్థులు, పాఠశాల డైరెక్టర్, ఉపాధ్యాయులు

అంబర్‌పేట: బాగ్‌అంబర్‌పేట డీడీకాలనీలోని ఆకాడమీక్ హైట్స్ పబ్లిక్‌స్కూల్ శనివారం నిర్వహించిన 'యూత్ పార్లమెంట్ డే' నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పార్లమెంట్, అసెంబ్లీలో పాలక, అధికార పక్షాల బాధ్యతలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించిన తీరు ఆకట్టుకున్నది. అలాగే గ్రామ పంచాయతీ వ్యవస్థపై సైతం విద్యార్థులు ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల టెక్నికల్ డైరెక్టర్ కౌశిక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సులక్షణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నియామకం



అజయ్‌కుమార్

అంబర్‌పేట: బాగ్‌అంబర్‌పేటకు చెందిన ఎడెల్లి అజయ్‌కుమార్ బీజేపీ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి శనివారం ప్రకటించిన కార్యవర్గంలో ఆయనక చోటు దక్కింది. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు. పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేస్తానన్నారు. అలాగే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు, ఇతర పార్టీ పెద్దలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

'ఎస్టీ కులాలపై కుట్రలు మానుకోండి'

ఉస్మానియా యూనివర్సిటీ: కాంగ్రెస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, మాజీ ఎంపీ సోయం బాబురావు, ఆదివాసీల నాయకులు ఎస్టీ కులాలపై కుట్రలు మానుకోవాలని ఆల్ ఇండియా ట్రైబల్ జేఏసీ చైర్మన్ రవీంద్రనాయక్ హెచ్చరించారు. తెలంగాణలో ఎస్టీ జాబితా నుంచి మూడు కులాలను తొలగించాలని సుప్రీంకోర్టులో పిటిషన్ వేయడం దారుణమన్నారు. ఎస్టీల ఐక్యతకు విఘాతం కల్గించే పిటిషన్ వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఎస్టీ నడుమ చిచ్చుపెడుతున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, మాజీ ఎంపీ సోయం బాబురావులను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు శరత్‌నాయక్ కోరారు.



గోల్నాకలో పూజల్లో కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి



గాంధీనగర్‌లో అన్నదానం..



గ్రీన్ రిచ్ రెసిడెన్సీ మహిళా విభాగం ఆధ్వర్యంలో కుంకుమార్చన..



వివేక్‌నగర్ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

ప్రత్యేక పూజలు.. అన్నదానాలు

గణేశ్ నవరాత్రోత్సవాలు అంగరంగా వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం మండపాల వద్ద ప్రత్యేక పూజలు.. కుంకుమార్చనలు నిర్వహించారు. అలాగే పలుచోట్ల అన్నాదానాలు చేపట్టగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

–అంబర్‌పేట్, ముషీరాబాద్ జోన్ బృందం



బాగ్‌అంబర్‌పేటలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



నేతాజీనగర్‌లో అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, ముఠా జైసింహ



కుషాల్‌గౌడ్ మండపం సికింద్రాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు భరత్‌గౌడ్‌కు సన్మానం..



దోమలగూడలోని సిద్ధి వినాయక ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



చిక్కడపల్లిలో పూజలు చేస్తున్న భరత్ గౌడ్



పద్మకాలనీలో అన్నదానం..

'సెక్షన్ 35 బీఎన్ఎస్ఎస్ యాక్ట్‌ను రద్దు చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న వి.రాజ్‌కుమార్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పోలీస్‌స్టేషన్‌లో ఇస్తున్న సెక్షన్ 35 బీఎన్ఎస్ఎస్ యాక్ట్‌ను రద్దు చేసి సామాన్యులకు న్యాయం చేయాలని ప్రజా సైన్యం వ్యవస్థాపక డాక్టర్ వేములవాడ రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా అడ్వకేట్స్ ఫోరం ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏడేళ్లలోపు శిక్షపడే కేసులకు కూడా నోటీసులు ఇచ్చి పోలీస్ స్టేషన్‌లో ఎక్కువగా డబ్బులు తీసుకుని ఇతరులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి చర్యల వల్ల నేరస్తులు కోర్టుకు వెళ్లకుండానే తప్పించుకునే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. స్టేషన్ బెయిల్‌ను రద్దు చేసి కోర్టు ద్వారానే న్యాయం జరిగేలా చట్టం తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా అడ్వకేట్స్ ఫోరం వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు గొల్లపల్లి కిష్టయ్య, తెలంగాణ అధ్యక్షుడు పూస సాయిబాబా, ఏపీ అధ్యక్షుడు చింత శాముల్, నాయకులు వెంకటాచారి , గాదె సురేశ్, కృష్ణవేణి, కొమ్మురాజు, జె.మల్లయ్య, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

తీరిన 'మురుగు' సమస్య

సాక్షి ఎఫెక్ట్..



పనులు చేపడుతున్న జలమండలి సిబ్బంది

అంబర్‌పేట: డివిజన్‌లోని ఆకాశ్‌నగర్, మున్సిపల్ కాలనీ పరిసర ప్రాంతాల్లో 'ఏడాదంతా మురుగు పరుగు' పేరిట 'సాక్షి' దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన కథనంపై జలమండలి అధికారులు స్పందించారు. శనివారం డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. అయితే డ్రైనేజీ శుభ్రం చేసే వాహనం వెళ్లే దారిలేకపోవడంతో అతి కష్టం మీద దారి ఏర్పాట్లు చేశారు. ఎట్టకేలకు ఆకాశ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో మురుగునీటి సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు ప్రారంభించడంతో స్థానికులుహర్షం వ్యక్తం చేస్తున్నారు.

విశ్వేశ్వరరావుకు వండర్‌బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం



చిక్కడపల్లి: పాటల రచయిత, స్వరకర్త, గాయకుడు రాయారావు విశ్వేశ్వరరావు వండర్‌బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారు. ఈ మేరకు వండర్‌బుక్ రికార్డ్స్ ముఖ్య సమన్వయకర్త బింగి నరేందర్‌గౌడ్ ప్రముఖ హాస్యావధాని శంకరనారాయణతో కలిసి ఆయనకు ధ్రువీకరణ పత్రాన్ని సంస్థ కార్యాలయంలో శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వివేక్‌నగర్‌లో విశ్వేశ్వరరావు మాట్లాడుతూ.. ఏడేళ్లుగా అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం సందర్భంగా పాటలు రచించి స్వరపరచడంతో తగిన గుర్తింపు లభించిందన్నారు. పాటలను రాయారావ్ విష యూ ట్యూబ్ చానల్‌లో విడుదల చేసిన ఏకైక వ్యక్తిగా రికార్డు సాధించానన్నారు. కార్యక్రమంలో ఆర్.వేణుగోపాలారావు పాల్గొన్నారు.

పదవీ విరమణ ఉద్యోగులకు సత్కారం



ప్రదీప్‌ను సత్కరిస్తున్న ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్

కాచిగూడ: ఆర్టీసీలో పదవీ విరమణ చేసిన ఉద్యోగులను ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ శనివారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధులు సక్రమంగా నిర్వర్తించే ఉద్యోగులకు వారు పనిచేసే సంస్థలో జీవితకాలం గౌరవం లభిస్తుందన్నారు. పదవీ విరమణ చేసిన ప్రదీప్ నాయుడుతో పాటు పలువురు ఆర్టీసీ ఉద్యోగులు, బంధువులు, మిత్రులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితేనే ఉన్నతస్థాయికి



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన సభ్యులు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విద్యార్థులు ప్రణాళికతో చదివితేనే ఉన్నతస్థాయికి ఎదుగుతారని అనురాగ్ యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ మహిపతి శ్రీనివాస్‌రావు అన్నారు. తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదివి 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో తెలంగాణ బాలోత్సవ అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఎస్.సోమయ్య, విజ్ఞాన దర్శిని అధ్యక్షుడు టి.రమేశ్, బాలోత్సవం కమిటీ సభ్యులు, బుచ్చిరెడ్డి, సుజావతి, మమత, రూప రుక్మిణి, ఆఫీస్ సెక్రటరీ బ్రహ్మణి, మహేశ్ దుర్గే పాల్గొన్నారు.

ఘనంగా ఓయూలో గ్రాడ్యుయేషన్ డే

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీ గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. శనివారం కాలేజీ అసెంబ్లీ హాల్‌లో జరిగిన కార్యక్రమానికి ఓయూ వీసీ ప్రొ.కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు డిగ్రీ పట్టాలను, బంగారు పతకాలను అందజేశారు. కార్యక్రమంలో గౌరవ అతిథి గోపాల్ టీకే కృష్ణ, డీన్ ప్రొ.కృష్ణయ్య, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొ.విద్యాసాగర్, ప్రిన్సిపాల్ ప్రొ.చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ ప్రొ.మంగు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు జర జాగ్రత్త..!



శివం రోడ్డు ఎస్‌బీఐ సమీపంలో రోడ్డు మధ్యలోనే ఏర్పడిన గుంత

నల్లకుంట: శివం సిండికేట్ బ్యాంక్ చౌరస్తా ఎస్‌బీఐ వద్ద రోడ్డు మధ్య(రెడ్ బిల్డింగ్‌కు వెళ్లే దారి)లో మ్యాన్‌హోల్ పక్కనే 2 రోజుల క్రితం ఓ గుంత ఏర్పడింది. అయినా జీహెచ్ఎంసీ, జలమండలి, సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు స్థానికులు ప్రమాద సూచికగా ఆ గుంతలో ఓ కర్రను పాతి చెట్ల కొమ్మలను పెట్టారు. ఆదివారం నుంచి గణనాథుల నిమజ్జనం ప్రారంభం కానున్నది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

షేక్ అఫ్రోజ్‌కు డాక్టరేట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ హిందీ విభాగం నుంచి షేక్ అఫ్రోజ్ పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. ప్రొ.షీలా మిశ్రా పర్యవేక్షణలో సమకాలీన హిందీ చలన చిత్రాల్లో వృద్ధుల ప్రతిబింబం అనే అంశంపై పరిశోధనకు డాక్టరేట్ లభించిన్నట్లు తెలిపారు. కామారెడ్డి జిల్లా బీర్కూర్ గ్రామానికి చెందిన షేక్ అఫ్రోజ్ అనేక ఇబ్బందులను ఎదుర్కొని ఉన్నత విద్యను అభ్యసించి ప్రభుత్వ టీచర్ ఉద్యోగం సాధించిన్నట్లు పేర్కొన్నారు. ఇటీవల ఓయూలో జరిగిన స్నాతకోత్సవంలో ఇస్రో చైర్మన్ డా.నారాయణన్, వీసీ ప్రొ.కుమార్ చేతుల మీదుగా డాక్టరేట్ డిగ్రీ పట్టాను అందుకున్నట్లు చెప్పారు.

కళలు, సంస్కృతిని పరిరక్షించుకోవాలి

గన్‌ఫౌండ్రీ: కళలు, సంస్కృతిని పరిరక్షించుకోవాలని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ప్రముఖ నృత్య శిక్షణాలయం దీపాంజలి సంస్థ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర సంగీత నాటక అకాడమి అవార్డు గ్రహీత దీపికారెడ్డి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలను శనివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రస్తుత సమాజంలో మన శాస్త్రీయ సంగీత కళలు కనుమరుగవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం కళాకారులను సత్కరించారు.

ఓయూ స్పోకెన్ ఇంగ్లిష్‌లో ప్రవేశాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీ సెల్ట్‌లో స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. పదిపాసైన ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, వ్యాపారులు, గృహిణులు, ఇతరులు సెల్ట్ శిక్షణలో ప్రవేశాలకు అర్హులని డైరెక్టర్ ప్రొ.నవీన్ శనివారం పేర్కొన్నారు. వచ్చే నెల 8 నుంచి ప్రారంభమగు శిక్షణ తరగతులకు 6 వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 7989903001 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

'ప్రజా ప్రయోజన వ్యాజ్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలి'



సమావేశంలో మాట్లాడుతున్న అడ్వకేట్ చిక్కుడు ప్రభాకర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాలకు ప్రాధాన్యతనివ్వాలని హైకోర్టు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ అన్నారు. అయిలు, ఎల్ఎస్ఎఫ్ఐ సంయుక్తాధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో పోస్ట్‌కార్డు వేస్తేనే ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని స్వీకరించేదన్నారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు, హైకోర్టు అనేక తీర్పుల్లో ప్రాధాన్యత ఇవ్వక పోగా జరిమానా కూడా విధిస్తున్నాయన్నారు. జీవించే హక్కు, ప్రజారోగ్యం, ప్రజా సంపద తదితర అంశాలకు సంబంధించి ఎలాంటి నిబంధనలు విధించకుండా ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో అయిలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పార్థసారధి, డి.ప్రవీణ్, ఎల్ఎస్ఎఫ్ఐ నాయకులు హైదర్ అలీ, సంపత్, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలు అందరికీ సమానమే



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ బలరాం

అంబర్‌పేట: చట్టంలో పౌరులందరికీ సమాన హక్కులు ఉంటాయని అంబర్‌పేట డిప్యూటీ తహసీల్దార్ బలరాం పేర్కొన్నారు. డివిజన్‌లోని పటేల్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో పోలీసు అధికారులతో కలిసి శనివారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజికంగా ఎదురయ్యే ఇబ్బందులను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అంబర్‌పేట ఏఎస్ఐ మజర్ షరీఫ్ మాట్లాడుతూ.. బాధితులు నిర్భయంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. బాల్య వివాహాలు చేయవద్దని, గల్లీల్లో ఆకతాయిల ఆగడాలపై నేరుగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో రెవెన్యూ, పోలీసు విభాగం అధికారులు, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

'బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం'



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం, జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అధ్యక్షతన శనివారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల కోసం ప్రత్యేక జీఓ ఇచ్చి స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహిస్తామనడం హర్షించదగ్గ విషయమని, గవర్నర్‌తో ఆర్డినెన్స్ ఆమోదింపజేసి జీఓ జారీ చేయాలన్నారు. ఏమైనా న్యాయపరమైన సమస్యలు వచ్చినా.. సుప్రీంకోర్టుకు ఎవరైనా వెళ్లిన బీసీలే జనాభా ఎక్కువ ఉందని తద్వారా కేసు గెలిచే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలా వెంకటేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మురళీధర్, స్వామి, రాజ్‌కుమార్, సూర్యనారాయణ, రవియాదవ్, బాలయ్య, బాల స్వామి పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించి ఎన్నికలకు వెళ్లాలి

పంజగుట్ట: పెండింగ్ బిల్లులు రాక మాజీ సర్పంచులు ఎవరైనా అసెంబ్లీ ముందు ఆత్మహత్యకు పాల్పడితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చరిత్రహీనుడిగా మిగిలిపోతాడని తెలంగాణ క్రాంతిదళ్ వ్యవస్థాపకుడు డాక్టర్ పృథ్వీరాజ్ యాదవ్ అన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ తాజా మాజీ సర్పంచుల ఆత్మహత్యలపై నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 3 లక్షల కోట్లు బడ్జెట్ ఉన్న రాష్ట్రంలో సర్పంచులు చేసిన పనికి రావాల్సిన సుమారు రూ. 700 కోట్లు విడుదల చేయమంటే గత 21 నెలలుగా ప్రభుత్వం తాత్సారం చేయడం సరికాదన్నారు. ఎన్నికలకు ముందు తమకు రావాల్సిన పెండింగ్ బిల్లుల కోసం తాము ఆందోళన చేస్తే దానికి ప్రస్తుతం మంత్రులుగా ఉన్నవారితో సహా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమకు పూర్తిగా మద్దతు పలికారని, అధికారంలోకి రాగానే నెల రోజుల్లో పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చారని 21 నెలలు అవుతున్నా వాటి ఊసే లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సర్పంచుల జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్య, మధుసూదన్ ప్రభాకర్ గౌడ్, రవీందర్, మహేష్ గౌడ్, మల్లయ్య, రాజేందర్, హేమలత, సురేష్ పాల్గొన్నారు.

ముగిసిన ఆలయ వార్షికోత్సవాలు



సాయిబాబాకు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

నల్లకుంట: బాగ్ అంబర్‌పేటలోని షిర్డీ సాయిబాబా మందిరంలో ఈనెల 28న ప్రారంభమైన ఆలయ వార్షికోత్సవాలు శనివారం ముగిశాయి. చివరి రోజు ఉదయం పండితుల మంత్రోచ్చరణల మధ్య సాయిబాబాకు క్షీరాభిషేకం చేసి హారతి ఇచ్చారు. అనంతరం శ్రీసుదర్శన జపం, హోమం నిర్వహించారు. అలాగే నవధాన్యాలు, సుగంధ ద్రవ్యాలు, కొబ్బరి కాయలు హోమంలో వేసి ఆవు నెయ్యితో పూర్ణాహుతి కావించారు. అంతకుముందు సూర్యనమస్కారాలు, పవమాన పారాయణం, అవబృదస్నానం, హారతి ఇచ్చారు. చివరగా పండితులను శాలువాతో సత్కరించారు. మధ్యాహ్నం భక్తులకు ప్రసాద వితరణ, ఉదయం పేదలకు అన్నదానం చేశారు. సాయిబాబా సంస్థాన్ ప్రతినిధులతో పాటు భక్తులు పాల్గొన్నారు.